క్లుప్తంగా

శాస్త్రోక్తంగా ద్విశత చండీయాగం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్థానిక కేబీఎన్ కళాశాల ఆవరణలో ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగం బుధవారం ఏడో రోజు శాస్త్రోక్తంగా జరిగింది. కన్యకాపరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అమ్మవారికి వెయ్యి మంది మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చండీ సప్తసతి హోమం, అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూలమంత్ర సంపుటితో చండీహోమం నిర్వహించారు. హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే



భవానీపురం(విజయవాడపశ్చిమ): తుమ్మలపల్లి కళాక్షేత్రం వెనుక భాగంలో ఉన్న శ్రీవీరబాబు స్వామి దేవస్థానంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మను ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా) చౌదరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీరబాబు స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షులు బసవరాజు, సెక్రటరీ గొంట్ల మోహనరావు, ట్రెజరర్ వీరబాబు, బచ్చు వెంకటేశ్వరరావు, బీజేపీ, టీడీపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, ఎం.ఎస్.బేగ్ పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి దర్శనానికి దూరం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవ వేళ ఇంద్రకీలాద్రిపై సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శన భాగ్యం కలిగినా మల్లేశ్వర స్వామి దర్శనం కలగలేదని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం బంగారు వాకిలి, రూ.300 క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్న భక్తులను మహా మండపం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు పంపారు. అయితే మల్లేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాలని పలువురు భక్తులు మెట్ల మార్గంలోని పోలీసులను ఆరా తీయగా వారికి సరైన అవగాహన లేకపోవడంతో కిందకు వెళ్లిన తర్వాత స్వామి దర్శనం చేసుకోవచ్చని పంపించారు. మహా మండపం కిందకు వెళ్లిన తర్వాత మల్లేశ్వరాలయానికి చేరుకునే వీలు లేకపోవడంతో భక్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మెట్ల మార్గంలో కిందకు దింపే క్రమంలో స్వామి ఆలయానికి చేరుకునే అవకాశం లేదని చెబితే మరో మార్గంలో స్వామి వారి ఆలయానికి వెళ్లేవారమని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా గరుడ వాహన సేవ



విజయవాడ కల్చరల్: లబ్బీపేట శ్రీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవం సందర్భంగా బుధవారం స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనమీద పురవీధుల్లో దర్శన మిచ్చాడు. భక్తుల గోవింద నామ స్మరణతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. అర్చకులు స్వామి వారిని గరడ వాహనంమీద అలంకరించారు. పలు ప్రాంతాల్లో స్వామిని ఊరేగించి, చతుర్వేదాల పారాయణం చేశారు. ఉదయం జియ్యంగార్ల గోష్టి, భక్తులు కోలాట సేవను నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మాంగంటి వేణుగోపాల్ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మధురంగా సాగిన సంకీర్తనం

విజయవాడ కల్చరల్: కంచి కామకోటి పీఠ పాలిత శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం లబ్బీపేట శరన్నవరాత్రులులో భాగంగా బుధవారం ప్రముఖ సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత మూర్తిత్రయం రచించి స్వరపరచిన దేవీ కీర్తనలు అమ్మా ఆనందదాయనీ, శ్రీ సరస్వతీ, సారసముఖీ, తామ్రలోచని, శ్రీనీలోత్పల వారికే తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయులు, మృదంగంపై సద్గురు చరణ్ సహకరించారు.

సరస్వతీ నమస్తుభ్యం



కనులపండువగా సాగుతున్న ఆదిదంపతుల నగరోత్సవం





నగరోత్సవంలో పాల్గొన్న నృత్యకళాకారులు



హారతి స్వీకరిస్తున్న భక్తులు



దుర్గమ్మను దర్శనం చేసుకుని బయటకు వస్తున్న భక్తులు



మహామండపంలో దుర్గమ్మ ఉత్సవమూర్తికి కుంకుమ పూజ

ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభంగా జరుగుతున్నాయి. దుర్గమ్మ శ్రీ సరస్వతీదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక లక్ష కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేకచండీహోమంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



దుర్గమ్మకు మొక్కుతున్న భవానీభక్తుడు



నగరోత్సవంలో కళాకారుల నృత్యం



నగరోత్సవంలో మంగళ వాయిద్య కళాకారులు



సువాసినీ పూజ చేస్తున్న అర్చకులు

నాడు కళకళ.. నేడు వెలవెల

- శిథిలావస్థకు చేరిన బొగ్గులైన్ రైల్వే కాలనీ క్వార్టర్స్
- రైల్వే ఉద్యోగుల క్వార్టర్స్‌పై కొరవడిన పోలీసుల నిఘా
- ఆకతాయిలకు అడ్డాగా మారిన వైనం

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): రైల్వే స్టేషన్ సమీపంలోని బొగ్గులైన్ రైల్వే కాలనీ ఒకప్పుడు 350లకు పైగా రైల్వే ఉద్యోగుల కుటుంబాలతో కళకళలాడింది. నేడు ఉద్యోగులు నివసించక వెలవెల బోతోంది. రైల్వే స్టేషన్‌కు అతి సమీపంలో, డీజిల్ లోకో షెడ్డుకు కూతవేటు దూరంలో ఈ కాలనీ ఉండేది. గతంలో ఇక్కడి క్వార్టర్స్‌లో ఉద్యోగులకు ఇల్లు లభించటమే కష్టంగా ఉండేది. నేడు క్వార్టర్స్‌కు వచ్చే వారే కరువయ్యారు.

శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్స్

ఉద్యోగుల జీతాల నుంచి వేల రూపాయలను హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) కింద కట్ చేసుకునే రైల్వే అధికారులు సదుపాయలను కల్పించలేదు. దీంతో క్వార్టర్స్‌లో నివసించేందుకు ఉద్యోగులు ఆసక్తి చూపడంలేదు. ఫలితంగా నిర్వహణకు నోచుకోక క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉద్యోగులు ఫిర్యాదు చేసినా చిన్న చిన్న మరమతులు కూడా చేపట్టకపోవటంతో వారు క్వార్టర్స్‌ను ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఫలితంగా శిథిలావస్థకు చేరిన క్వార్టర్లు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

అధిక శాతం మంది రైల్వే ఉద్యోగులు క్వార్టర్స్‌ను ఖాళీ చేసి వెళ్లిపోవటంతో వాటిని ఆకతాయిలు, బ్లేడ్ బ్యాచ్ సభ్యులు అడ్డాగా మార్చుకున్నారు. మద్యం, గంజాయి, అసాంఘిక కార్యకాలపాలకు పాల్పడుతూ చెలరేగిపోతున్నారు. దీంతో ఉన్న కొద్దిపాటి కుటుంబాల వారు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తాము కూడా కార్టర్లను ఖాళీచేసి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆ కుటుంబాల వారు వాపోతున్నారు.

రైల్వే సొత్తు చోరుల పాలు

ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌లోని విలువైన తలుపులు, కిటికీలు, పైపులు, టైల్స్‌ను ఆకతాయిలు చోరీ చేశారు. దీంతో నేడు క్వార్టర్లు గోడలతో మాత్రమే దర్శనమిస్తున్నాయి. వేల రూపాయలు ఖరీదు చేసే వస్తువులను చోరులు తస్కరిస్తున్నా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సిబ్బంది పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం రెండు రోజులు ఏదైనా ఊరు వెళ్లి వచ్చేటప్పటికి తమ ఇళ్లల్లోని విలువైన వస్తువులను దోచుకెళ్తున్నారని వాపోతున్నారు. దీంతో ఊరు వెళ్లాలంటేనే భయమేస్తోందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.





శిథిలావస్థకు చేరుకున్న రైల్వే క్వార్టర్స్ (ఇన్‌సెట్) తలుపులు, కిటికీలు చోరీ చేయడంతో గోడలకు పరిమితమైన క్వార్టర్

కొరవడిన నిఘా

రైల్వే కాలనీని అడ్డాగా చేసుకుని ఆకతాయిలు, గంజాయి, బ్లేడ్ బాచ్ సభ్యులు చెలరేగిపోతున్నా ఈ ప్రాంతంపై పోలీసుల నిఘా కరువైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మద్యం, గంజాయి మత్తులో వారు చేసే గొడవలకు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. ఆకతాయిల ఆగడాలపై పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని మహిళలు వాపోతున్నారు.

ఆకతాయిల ఆగడాలు

బొగ్గులైన్ రైల్వే కాలనీలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయి. మద్యం, గంజాయి తాగి వారు గొడవలకు దిగుతున్నారు. వారి చేష్టలతో భయపడి ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నాం. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. వారు తీసుకున్న చర్యలు శూన్యం.

– సుజాత, స్థానికురాలు

పోలీసులు నిఘా పెట్టాలి

పోలీసులు నిఘా పెట్టి చర్యలు తీసుకుంటేనే ఆకతాయిల ఆగడాలు ఆగుతాయి. గతంలో మద్యం, గంజాయి తాగే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించి తగిన చర్యలు తీసుకునే వారు. ప్రస్తుతం అవి లేకపోవంతో వారి అగడాలకు అడ్డే లేకుండా పోయింది.

– రాణి, స్థానికురాలు

అలరించిన నృత్యాభినయం



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనక దుర్గానగర్‌లోని కళావేదిక మీద కళాకారులు ప్రదర్శిస్తున్న అంశాలు రసవత్తరంగా సాగుతున్నాయి. జి.నాగమణి బృందం భక్తి సంగీత కార్యక్రమాలు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. మీనాక్షి, శ్రీనివాస్, సీహెచ్ అజయ్‌కుమార్, యువ సంగీత కళాకారులు మల్లాది సింధురాగేశ్వరి, బి.సింధు బృంద సభ్యులు వాగ్గేయకార కృతులను ఆలపించారు. సంప్రదాయ నృత్య కార్యక్రమంలో భాగంగా చదలవాడ ఆనంద్, సీహెచ్ ఆనంద్, ఎం.పావని సాత్విక్ మహాదేవేశ్వర్, ఎ.సంతోష్, బి.భవాని, ఎం.విజయలక్ష్మి, కె.పవిత్ర, దీప్తి నరేష్, మాగలూరి త్రినాథాచారి, నాట్యాచార్యుడు ఎస్.వి.సత్యనారాయణ, పి.మంజూష తమ బృందంలోని చిన్నారులు, సీనియర్ కళాకారులు పలు అంశాలను ప్రదర్శించారు. చక్కని తల్లికి ఛాంగ్‌భళా, ఇదిగో భద్రాద్రి, పలుకు తేనియ తల్లి, బ్రహ్మమొక్కటే, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు తదితర కీర్తనలనలకు నృత్యాలను అభినయించారు. నిర్వాహకులు కళాకారులకు ప్రశంసాపత్రాలను, అమ్మవారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

రోడ్డుకు అడ్డంగా బూస్టర్ నిర్మాణం




కల్యాణ మండపం ఎదుట నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బూస్టర్ గది

చిట్టినగర్ 48వ డివిజన్ పరిధిలోని కామాక్షి విశ్వబ్రాహ్మణ కల్యాణమండపం వద్ద రోడ్డుకు అడ్డంగా మంచినీటి బూస్టర్ నిర్మాణం చేపట్టారు. చిట్టినగర్ సెంటర్ నుంచి సొరంగం వైపు వెళ్లే దారి ఇరుగ్గా (సెంట్రల్ డివైడర్) ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం కొంత మంది టీడీపీ నాయకులు కల్యాణ మండపం ముందు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని బూస్టర్ నిర్మాణం చేపట్టారు. రోడ్డును మూసేస్తూ బూస్టర్ నిర్మాణం ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య ఉంటే వీఎంసీ వాటర్ సప్లయ్ విభాగం అధికారులు స్పందించి బూస్టర్ నిర్మించాల్సి ఉండగా టీడీపీ నాయకుల జోక్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బూస్టర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)

సరస్వతీదేవిగా విజయదుర్గ దర్శనం



శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన శాంభవీమాత



సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన గంగానమ్మ

పశ్చిమ నియోజకవర్గంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం పలు ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో తెల్లవారుజామున అమ్మవారికి విశేష అలంకరణ, సామూహిక కుంకుమార్చన, విశేష అభిషేకాలను నిర్వహించారు.

–చిట్టినగర్/వించిపేట/వన్‌టౌన్/భవానీపురం



శ్రీగంగానమ్మ దుర్గ మారెమ్మ విశ్వేశ్వర దేవస్థానంలో సరస్వతీదేవి అలంకారం



పోలేరమ్మ దేవస్థానంలో శ్రీసరస్వతీదేవి అలంకారం



దాసాంజనేయస్వామి సన్నిధిలో సరస్వతీదేవి



సరస్వతీదేవిగా విజయదుర్గా అమ్మవారు



సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన మహాలక్ష్మీదేవి



గంగానమ్మకు ప్రత్యేక పూజలు

మలబార్‌లో ప్రత్యేక దీపావళి ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బంగారు, వజ్రాభరణాల రిటైల్ చైన్‌లలో ఒకటైన మలబార్ పండుగల వేళ ప్రత్యేక దీపావళి ఆఫర్లు ప్రవేశ పెట్టినట్లు విజయవాడ షోరూమ్ హెడ్ ఎం.అర్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంజీరోడ్డులోని తమ షోరూమ్‌లో బుధవారం ప్రత్యేక ఆఫర్లను వివరించారు. బుధవారం ప్రారంభమైన ఆఫర్లు నవంబర్ మూడో తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి రూ.50 వేల విలువైన బంగారు ఆభరణాల కొనుగోలుపై 200 మిల్లీగ్రాముల బంగారు నాణెం, ప్రీషియస్, అన్‌కట్, పోల్కీ జ్యూవెలరీ కొనుగోలుపై 300 మిల్లీగ్రాముల బంగారు నాణెం, వజ్రాభరణాల కొనుగోలుపై 400 మిల్లీ గ్రాముల బంగారు నాణెంను ఉచితంగా ఇస్తామన్నారు. ఈ ఆఫర్లతో పాటు పది శాతం నగదును ముందస్తుగా చెల్లించడం ద్వారా తమకు నచ్చిన ధనత్రయోదశి ఆభరణాలను ముందుగానే బుక్ చేసుకోవచ్చని సూచించారు.